సాక్షి జగిత్యాల

మంగళవారం : 21 : ఫిబ్రవరి : 2023



నృసింహునికి మొక్కులు

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. భక్తులు స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు.



వైభవంగా బోనాల పండుగ

మేడిపెల్లి : తొంబర్రావుపేటలో సోమవారం బద్ది పోచమ్మ బోనాల పండుగ వైభవంగా జరుపుకున్నారు. మహిళలు పూజలు చేశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.0/17.0

గాలిలో తేమశాతం తక్కువగా నమోదు అవుతుంది. పగటిపూట ఎండగా ఉంటుంది. సాయంత్రం చలితీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రాజన్న హుండీ లెక్కింపు

పెగడపల్లి(ధర్మపురి): స్థానిక స్వయంభూ శ్రీ రాజరాజేశ్వరస్వామి హుండీని ఆలయ ఆవరణలో సోమవారం లెక్కించారు. శివరాత్రి సందర్భంగా నాలుగు రోజులపాటు ఉత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా రూ.11.22 లక్షలు ఆదాయం సమకూరింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గంగారెడ్డి, సర్పంచ్ శ్రీనివాస్, ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు వెంకటేశం, మాజీ అధ్యక్షుడు కరుణాకర్‌రావు, ఉప సర్పంచ్ సాగర్‌రావు, ప్రధాన కార్యదర్శి పోచమల్లు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి డాక్టరేట్



ప్రొఫెసర్లతో ఉపాధ్యాయుడు గణేశ్

ధర్మపురి: పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు గొల్లపెల్లి గణేశ్‌కు ఉస్మానియా యూనివర్సిటీ ఇటీవల డాక్టరేట్‌తో సత్కరించింది. 'ఇంటర్నెట్‌లో తెలుగు భాషా సాహిత్యం– అధ్యయనం'పై ఆయన చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్‌తో గౌరవించింది. గణేశ్ స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. తెలుగు సాహిత్యంపై ఉన్న మక్కువతో సుమారు ఏడేళ్లుగా ఇంటర్నెట్‌లో తెలుగు భాషా సాహిత్యంపై పరిశోధనలు చేస్తున్నారు. ఆయన గతంలో కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీలో బంగారు పతకం సాధించారు. 2021కుగాను జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డులు కూడా సొంతం చేసుకున్నారు. గణేశ్‌ను పలువురు అభినందించారు.

'రాష్ట్రంలో ప్రజావ్యతిరేక పాలన సాగుతోంది'



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్: రాష్ట్రంలో పోలీసు, ప్రజావ్యతిరేక పాలన కొనసాగుతోందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ధ్వజమెత్తారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజాసమస్యలపై చట్టసభల్లో మాట్లాడితే మైక్ కట్ చేస్తున్నారని ఆరోపించారు. ప్రజల వద్దకు వెళ్లేందుకు పోలీసులు అనుమతి ఇవ్వడంలేదని పేర్కొన్నారు. మహబూబాబాద్ ఘటనలో రాజకీయ పార్టీ నాయకురాలు హైకోర్టు అనుమతి తీసుకుని పాదయాత్ర చేపడితే.. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా మాట్లాడారని పోలీసులు అనుమతి రద్దు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. మెదక్ పోలీసులు ఖదీర్‌ఖాన్‌ను చైన్ స్నాచింగ్ అభియోగంతో థర్డ్‌డిగ్రీ ప్రయోగించడంతో మృతి చెందాడని ఆరోపించారు. ఇందుకు కారకులైన వారిపై ఐపీసీ సెక్షన్ 302 ప్రకారం చట్టపరమైన కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మృతిపై హైకోర్టు చీఫ్ జస్టిస్‌తో విచారణ చేపట్టాలని కోరారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మన్సూర్ అలీ, నాయకులు బండ శంకర్, రమేశ్‌బాబు, దుర్గయ్య, జగదీశ్వర్, రాధాకిషన్‌రావు, గంగారెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఉద్యోగులను ఆదుకోవాలి



ఆందోళన చేస్తున్న నాయకులు

జగిత్యాల: గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కారోబార్లు, బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ ఇవ్వాలని, మల్టీ పర్పస్ వర్కర్స్ విధానం రద్దు చేయాలని తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్స్, యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. బీజేపీ ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు చంద్రశేఖర్, మల్లేశం ఉన్నారు.

'విచారణ జరిపించాలి'

జగిత్యాలరూరల్: ఈ – పంచాయతీల్లో కంప్యూటర్ ఆపరేటర్ల నియామకాల్లో చోటుచేసుకున్న అక్రమాలపై విచారణ జరిపించాలని నిర్మల్ జిల్లా కడెం మండలం కొండుకూర్ గ్రామానికి చెందిన రఘు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం ప్రజావాణి ద్వారా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లాలోని ఈ– గ్రామపంచాయతీల్లో 18 కంప్యూటర్ ఆపరేటర్ల నియామకాల్లో నిబంధనలు అతిక్రమించారంటూ 'ఆపరేటర్ల ఉద్యోగాల్లో అక్రమాలు' శీర్షికన ఈనెల 14న 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని రఘు విన్నవించాడు.

శ్లాబు మారలే..!

- కరెంట్ బిల్లు ఎక్కువ రాలే..
- సకాలంలో బిల్లింగ్ ప్రక్రియ పూర్తి
- 13వ తేదీలోగా 100శాతం నమోదు
- వంపిణీ సంస్థ పరిధిలోనే అగ్రస్థానంలో జిల్లా



మీటర్ రీడింగ్ నమోదు చేస్తున్న సిబ్బంది

జగిత్యాలఅగ్రికల్చర్: మొన్నటిదాకా కరెంట్ బిల్లింగ్ ప్రక్రియలో రోజుల తరబడి ఆలస్యం జరిగేది. తద్వారా శ్లాబులు మారి బిల్లు అధికంగా వచ్చేది. దీంతో వినియోగదారులు తరచూ ఆందోళనకు దిగేవారు. ఒక్కోసారి సిబ్బందితో వాగ్వాదానికీ దిగేవారు. ఈ సమస్యకు శాశ్వతంగా పరిష్కారం చూపేందుకు ట్రాన్స్‌కో అధికారులు ప్రణాళిక ప్రకారం ముందుకు సాగారు. గడువులోగా వందశాతం బిల్లింగ్ నమోదు చేయడంతో నిర్దేశిత శ్లాబుల్లోనే కస్టమర్లకు బిల్లులు వస్తున్నాయి. అంతేకాదు.. ప్రతినెలా బిల్లింగ్ చేయడంలో సిబ్బంది పనితీరు ఉత్తర తెలంగాణ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ పరిధిలో అగ్రస్థానంలో నిలిచింది. దీంతో సంస్థ సీఎండీ గోపాల్‌రావు వారిని ఇటీవల అభినందించారు.

బిల్లుల వసూళ్లకు ఐదు ఈఆర్‌వోలు..

- జిల్లాలో విద్యుత్ బిల్లింగ్, వసూళ్ల కోసం ఐదు ఎలక్ట్రికల్ రెవెన్యూ ఆఫీస్(ఈఆర్‌వో)లు పనిచేస్తున్నాయి.
- రెండు విద్యుత్ సబ్ డివిజన్లు జగిత్యాల, మెట్‌పల్లి ఉన్నాయి.
- జగిత్యాల పరిధిలో జగిత్యాల టౌన్, జగిత్యాల రూరల్, మల్యాల, మెట్‌పల్లి పరిధిలో మెట్‌పల్లి, కోరుట్ల ఈవోఆర్‌లు పనిచేస్తున్నాయి.
- ఈ కార్యాలయాల్లోని సిబ్బంది ప్రతినెలా 8 కేటగిరీల్లోని విద్యుత్ బిల్లులు వసూలు చేస్తున్నారు.

బిల్లింగ్ నమోదుకు ప్రైవేట్ సంస్థలు..

- విద్యుత్ బిల్లింగ్ నమోదుకు ప్రభుత్వ సిబ్బంది కొరత ఎదురైంది. దీంతో కొన్నేళ్ల క్రితం ప్రైవేట్ సంస్థలకు ఆ బాధ్యత అప్పగించారు. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు ఇష్టానుసారంగా బిల్లింగ్ నమోదు చేయడంతో శ్లాబుల్లో వ్యత్యాసం వచ్చి బిల్లులు అధికంగా వచ్చాయి. దీంతో వినియోగదారులు ఆందోళనకు దిగారు. దీంతో, 30 శాతం విద్యుత్ సిబ్బంది, 70 శాతం కాంట్రాక్ట్ సంస్థలు బిల్లింగ్ చేసేలా అధికారులు నిర్ణయం తీసుకున్నారు. అయినా, సమస్య పరిష్కారం కాలేదు. దీంతో విద్యుత్ సిబ్బందికి 40–45 శాతం, మిగతా బిల్లింగ్ బాధ్యతలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించారు.

13నాటికే 100 శాతం బిల్లింగ్..

- జిల్లాలో 3,28,795 విద్యుత్ కనెక్షన్ల బిల్లింగ్ ఈనెల 13వ తేదీ నాటికే 100 శాతం నమోదు చేశారు. ఇందులో ప్రైవేట్ సంస్థలు 1,96,703 కనెక్షన్లు, విద్యుత్ సిబ్బంది 1,32,092 కనెక్షన్ల బిల్లింగ్ పూర్తిచేశారు.

విద్యుత్ కనెక్షన్ల సమాచారం

కేటగిరీ	కనెక్షన్ తీరు
1	గృహావసరాలు
2	వ్యాపారం
3	ఇండస్ట్రియల్
4	కుటీర పరిశ్రమలు
5	వ్యవసాయం
6	వాటర్ వర్క్స్
7	ప్రార్థన స్థలాలు, ప్రభుత్వ హాస్టళ్లు
8	నాన్ స్లాబ్ 3, 4 కేటగిరీలు

ఒక్క యూనిట్ పెరిగినా శ్లాబు మారుడే..

- గృహావసరాలకు 50 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగిస్తే యూనిట్‌కు రూ.1.95 చార్జీ ఉంటుంది. 51–100 వరకు వినియోగిస్తే రూ.3.10 వరకు, 0–100 యూనిట్లు వినియోగిస్తే రూ 3.40 వరకు, 101–200 వరకు యూనిట్లు వినియోగిస్తే రూ.4.80 వరకు బిల్లులు వస్తాయి.
- ఇలా యూనిట్లు పెరిగికొద్దీ యూనిట్ చార్జీ కూడా పెరుగుతూ ఉంటుంది.
- బిల్లింగ్ నమోదు చేసే సిబ్బంది నాలుగైదు రోజులు ఆలస్యంగా వస్తే యూనిట్లు పెరిగి, శ్లాబులు మారి బిల్లులు అధికంగా వచ్చి వినియోగదారుల జేబులు గుల్ల అవుతున్నాయి. తద్వారా సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

సకాలంలో బిల్లింగ్ చేస్తాం



సకాలంలో విద్యుత్ బిల్లులు జారీచేయడంలో ఉత్తర తెలంగాణలోని 16 జిల్లాల్లో మనం నంబర్‌వన్‌గా నిలిచాం. మా సిబ్బంది సహకారం మరువలేనిది. బిల్లులు త్వరగా ఇస్తున్నందుకు వినియోగదారులు కూడా సకాలంలో బిల్లులు చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించాలి.

– సత్యనారాయణ, ఎస్ఈ, ఎన్పీడీసీఎల్

మా సర్పంచ్ వేధిస్తున్నారు..

- మా ఊరులో ఉండొద్దంటున్నారు..
- వేములకుర్తి గ్రామస్తుల ఆవేదన
- ప్రజావాణి ద్వారా అదనపు కలెక్టర్లకు ఫిర్యాదు



కలెక్టరేట్ ఎదుట వేములకుర్తి గ్రామస్తులు

జగిత్యాల: 'మమ్మల్ని మా ఊర్లో ఉండనివ్వడం లేదు.. వివాహాలను అడ్డుకుంటున్నారు.. గ్రామంలో ఎవరు చనిపోయినా ఆధార్‌కార్డు ఇస్తేనే అంత్యక్రియలకు అనుమతి ఇస్తానంటున్నారు' అని ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ప్రజావాణి ద్వారా అదనపు కలెక్టర్లకు ఫిర్యాదు చేశారు. 40ఏళ్లుగా వేములకుర్తిలో జీవనం సాగిస్తున్నామని తెలిపారు. వలస వచ్చి ఇక్కడ ఉండొద్దా? అని ప్రశ్నించారు. మా పని మేం చేసుకుంటామని, మమ్మల్ని బతకనివ్వాలని ప్రజావాణి ద్వారా వేడుకున్నారు. సుమారు 20 మంది వరకు కలెక్టరేట్‌కు తరలివచ్చి తమ ఆవేదనను వెలిబుచ్చారు. సుమారు 60 కుటుంబాలు గ్రామంలో ఉంటున్నాయని, గ్రామం వదిలిపెట్టి వెళ్లిపోవాలని సర్పంచ్ ఒత్తిడి తీసుకు వస్తున్నారని ఆరోపించారు. అధికారులు జోక్యం చేసుకుని న్యాయం చేయాలని వేడుకున్నారు.

ఇల్లు కిరాయి ఇవ్వడం లేదు



నేను పరాయి దేశం పోయి వచ్చి అంతా లాసైన. అప్పుల బాధతో నా సొంతింటిని అమ్ముకున్న. కిరాయి ఇంట్లో ఉండనివ్వడంలేదు. ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

– మాచర్ల లక్ష్మణ్

పెళ్లి అడ్డుకునేందుకు యత్నించారు



నేను దివ్యాంగుడిని. ఇటీవల నాకు వివాహం నిశ్చయమైంది. పెళ్లిని అడ్డుకునేందుకు సర్పంచ్ ప్రయత్నం చేశారు. బ్రాహ్మణులను రాకుండా చేశారు. వేరేవాళ్లతో పెళ్లి చేయించుకున్నాం.

– రాట్నం మహేశ్

శవాన్ని అడ్డుకున్నారు



మా తాత ముత్తయ్య ఇటీవల చనిపోయాడు. ఆ శవాన్ని అంత్యక్రియలకు తీసుకెళ్దామంటే ఆధార్ కార్డు ఇస్తేనే పంపిస్తామని సర్పంచ్ చెప్పిండ్రు. చేసేదిలేక ఆధార్‌కార్డులు ఇచ్చినం. ఇప్పుడు మా వద్ద అవిలేవు. ఇబ్బందిగా ఉంది.

– రాజ్‌కుమార్

భక్తజన సంద్రం



సారంగాపూర్(జగిత్యాల): ప్రముఖ పుణ్యక్షేత్రం దుబ్బరాజేశ్వరస్వామి జాతర బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రథోత్సవం వైభవంగా జరి గింది. ఉమ్మడి కరీంనగర్, తదితర జిల్లాల నుంచి సుమారు 1.50 లక్షల మంది భక్తులు హాజరయ్యా రు. ఉదయం 9.30 గంటల ప్రాంతంలో రథోత్సవం ప్రారంభమైంది. అంతకుముందు ఉత్సవమూర్తులను రథంపై ఆశీనులను చేశారు. పూజాకార్యక్రమాల అనంతరం పెంబట్ల, కోనాపూర్ పురవీధుల్లో ఆలయం చుట్టూ దాదాపు రెండు గంటల పాటు రథాన్ని భక్తులు లాగుతూ ముందుకు సాగారు. మరోవైపు.. జాతర ప్రాంగణంలో పారిశుధ్యం లోపించి భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అసౌకర్యాలతో అవస్థల పాలయ్యారు.



నేరాల నియంత్రణ లక్ష్యంగా విధులు

- ఎస్పీ భాస్కర్



జగిత్యాలక్రైం: నేరాల నియంత్రణ లక్ష్యంగా పోలీసులు పనిచేయాలని ఎస్పీ భాస్కర్ సూచించారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలతో పెండింగ్ కేసులు, గ్రేవ్ కేసులు, ఎస్సీ, ఎస్టీ కేసుల పురోగతిపై సోమవారం ఆయన సమీక్షించారు. పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలన్నారు. ఇందుకోసం పరిశోధన వేగవంతం చేయాలని, చార్జీషీటు దాఖలు చేయాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పోక్సో కేసుల్లో విచారణ వేగవంతంగా పూర్తి చేయాలని చెప్పారు. నాన్ బెయిలబుల్ కేసుల్లో తప్పించుకు తిరుగుతున్న వారిని అదుపులోకి తీసుకోవాలని అన్నారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని, తరచూ వాటి పనితీరు తనిఖీ చేయాలని సూచించారు. ఠాణాకు వచ్చే ప్రతీ ఫిర్యాదు స్వీకరించి, బాధితులకు సత్వర న్యాయం చేయాలని ఆదేశించారు. డయల్ 100 కాల్స్‌కి తక్షణమే స్పందించి సకాలంలో ఘటనా స్థలికి చేరుకోవాలని చెప్పారు. 17 ఫంక్షనల్ వర్టికల్స్‌ను పటిష్టంగా అమలు చేయాలని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ కోసం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రౌడీ షీటర్ల కదలికలపై నిఘా ఉంచాలని ఆదేశించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిపై రౌడీ షీట్స్ తెరవాలని అన్నారు. అనవసరంగా అర్ధరాత్రి రోడ్లపైకి వచ్చే యువత లక్ష్యంగా తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. డీఎస్పీలు ప్రకాశ్, రవీందర్‌రెడ్డి, రవీంద్రకుమార్, సీఐలు శ్రీనివాస్, రాజశేఖర్‌రాజు, కిశోర్, రమణమూర్తి, లక్ష్మీనారాయణ, కోటేశ్వర్, మల్లయ్య, సరిలాల్, ఎస్సైలు, డీసీఆర్బీ, ఐటీ కోర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు నిరంతర విద్యుత్

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ట్రాన్స్‌కో ఎస్ఈ సత్యనారాయణ ఆదేశించారు. స్థానిక సబ్‌స్టేషన్‌లోని రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో ఒకదాని కంట్రోల్ బ్రేకర్ పనిచేయడంలేదు. దీంతో సోమవారం సబ్‌స్టేషన్‌ను సందర్శించిన ఎస్ఈ.. సమస్యను పరిశీలించారు. పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌కు అవసరమైన విడిభాగాలు తక్షణం తెప్పించారు. యుద్ధప్రాతిపదికన బ్రేకర్ల మరమ్మతు చేయించి, విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. ప్రస్తుతం రెండు ట్రాన్స్‌ఫార్మలు వందశాతం సామర్థ్యంతో పనిచేస్తున్నాయని తెలిపారు. డీఈ రాజిరెడ్డి, ఏడీఈ సింధూర్‌శర్మ, ఏఈలు మనోహర్, గంగాధర్ పాల్గొన్నారు.

2025లో కరీంనగర్‌కు రైలు..!

- మరో రెండేళ్లలో కొత్తపల్లి–మనోహరాబాద్ మార్గం పూర్తి
- ఈ ఏడాది దుద్దెడ, సిద్దిపేటకు, 2024లో సిరిసిల్లకు రైలు
- కొండగట్టు మాస్టర్‌ప్లాన్‌తో ఈ మార్గానికి పెరిగిన డిమాండ్
- ఒకేమార్గంలో కొమురవెల్లి, వేములవాడ, కొండగట్టు, కాళేశ్వర పుణ్యక్షేత్రాలు
- హైదరాబాద్, సికింద్రాబాద్ డివిజన్లకు ముఖద్వారంగా కరీంనగర్



కరీంనగర్ రైల్వేస్టేషన్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వే ప్రాజెక్టు తుదిదశకు వచ్చింది. మరో రెండేళ్లలో ప్రాజెక్టు పూర్తి చేయాలని దక్షిణ మధ్య రైల్వే లక్ష్యాన్ని విధించుకుంది. ప్రస్తుతం దక్షిణ మధ్య రైల్వే చాలా వేగంగా పనులు చేపడుతోంది. 2025 మార్చి వరకు ఈ ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేయనున్నారు. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే ప్రాజెక్టు స్వరూపం, ఖర్చు, పూర్తి చేసే తేదీ తదితరాలను ప్రకటించింది. సికింద్రాబాద్ నుంచి కరీంనగర్‌ను కలుపుతూ రూపొందించిన మనోహరాబాద్ (మేడ్చల్)– కొత్తపల్లి (కరీంనగర్) రైల్వే ప్రాజెక్టు ఇది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ముందు అధిక ఖర్చు, వయబిలిటీ ఉండదన్న కారణాలతో పక్కన పెట్టిన ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం వినతితో 2016లో దక్షిణ మధ్య రైల్వే చేపట్టింది. ప్రస్తుతం గజ్వేల్ వరకు ట్రయల్ రన్ నడుస్తోంది. ప్రభుత్వం వేములవాడ, కొండగట్టుకు మాస్టర్‌ప్లాన్ రూపొందించి అభివృద్ధి చేస్తుండటంతో ఈ మార్గంలో ఆధ్యాత్మిక పర్యాటకం ఊపందుకోనుంది.

మాస్టర్‌ప్లాన్లతో పెరిగిన డిమాండ్..!

ఈ ప్రాజెక్టు పూర్తయితే.. రాష్ట్రంలో పలు ఆధ్యాత్మిక క్షేత్రాలు ఒకే రైల్వేలైను పరిధిలో దర్శించుకునే వీలు కలుగుతుంది. ఈ మార్గంలో కొమురవెల్లి, కొండపోచమ్మ, నాచారం లక్ష్మీ నర్సింహా స్వామి, నాంపల్లి, వేములవాడ పుణ్యక్షేత్రాలు వస్తాయి. కొత్తపల్లి స్టేషన్ అందుబాటులోకి వస్తే.. అక్కడ నుంచి కరీంనగర్ స్టేషన్ నుంచి కొండగట్టు (నూకపల్లి–మల్యాల)స్టేషన్‌కు కలపవచ్చు. ఇటీవల బడ్జెట్‌లో వేములవాడ మాస్టర్ ప్లాన్ కోసం రూ.50 కోట్లు, కొండగట్టుకు రూ.600 కోట్లు ప్రకటించడంతో ఈ రెండు పుణ్యక్షేత్రాలకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. ఈ రెండు ఆలయాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడంతో కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వేలైన్ ప్రాధాన్యం పెరిగింది. ఇదే విషయాన్ని దక్షిణమధ్య రైల్వే కూడా గుర్తించింది. అందుకే, ఈ రైల్వేలైన్‌ను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసే పట్టుదలతో ఉన్నామని దక్షిణ మధ్య రైల్వే అధికారులు ధీమాగా ఉన్నారు. ఈ ప్రాజెక్టు ఇప్పటికే 46 శాతం మేర ప్రాజెక్టు పూర్తయింది.

షిరిడీ, ముంబై, బెంగళూరులకు రైళ్లు..!

కొత్తపల్లి– మనోరాబాద్ రైల్వేలైన్ హైదరాబాద్ డివిజన్‌లో ఉంది. అదే ఖాజీపేట–బల్లార్షా మార్గం సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోకి వస్తుంది. ఈ రెండు మార్గాలకు కొత్తపల్లి జంక్షన్‌లా మారనుంది. ఉత్తర భారతదేశానికి దక్షిణ భారతదేశానికి ఇది ముఖద్వారంగా అవతరించనుంది. ఈ మార్గం పూర్తయితే ఉమ్మడి జిల్లాలోని సిరిసిల్ల, సిద్దిపేట, జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్ వాసులకు షిరిడీ, ముంబై, షిరిడీ, బెంగళూరులకు రైళ్లు నడపొచ్చని దక్షిణమధ్య రైల్వే అధికారులు తెలిపారు. తద్వారా ఆయా ప్రాంతాల వారికి రైలు సౌకర్యం మరింత మెరుగుపడుతుందని అంటున్నారు.

ప్రాజెక్టు పురోగతి..!

సంవత్సరం	మార్గాలు	లక్ష్యం	కిలోమీటర్లు
2020–21	మనోహరాబాద్–గజ్వేల్	పూర్తయింది	31.071
2021–22	గజ్వేల్–కొడకండ్ల	పూర్తయింది	12.25
2022–23	కొడకండ్ల–దుద్దెడ	ఆగస్టు 2023	21.50
2023–24	దుద్దెడ–సిద్దిపేట	డిసెంబర్ 2023	11.10
2023–24	సిద్దిపేట–సిరిసిల్ల	మార్చి 2024	37.15
2024–25	సిరిసిల్ల–కొత్తపల్లి	మార్చి 2025	39.01

ఏడాది చివరలో సిద్దిపేట, దుద్దెడలకు..

ప్రాజెక్టులో భాగంగా ప్రస్తుతం మనోహరాబాద్–గజ్వేల్ మధ్య 32 కి.మీ మేర ట్రాక్ పూర్తయి ట్రయల్‌రన్ నడుస్తోంది. గజ్వేల్ నుంచి కొడకండ్ల వరకు కొత్తగా నిర్మించిన 12.5 కిలోమీటర్ల మార్గం కూడా పూర్తయి ట్రయల్‌రన్‌కు సిద్ధంగా ఉంది. ఇక ఈ ఏడాది ఆగస్టులో కొడగండ్ల–దుద్దెడను ఆగస్టులో, దుద్దెడ–సిద్దిపేటను డిసెంబరులో, సిద్దిపేట సిరిసిల్ల వచ్చే ఏడాది మార్చిలో, సిరిసిల్ల– కొత్తపల్లి 2025 మార్చిలో పూర్తి చేయనున్నారు. ఇప్పటివరకు పనులన్నీ అనుకున్న విధంగా గడువులోనే జరుగుతుండటం గమనార్హం.

మనోహరాబాద్–కొత్తపల్లి ప్రాజెక్టు (151.36 కిలోమీటర్లు) వివరాలు..

ప్రాజెక్టు యొక్క పొడవు	151.36 కిలోమీటర్లు
మంజూరైన సంవత్సరం	2016–17
ప్రాజెక్టు ఖర్చు	రూ. 1,167కోట్లు
ఇప్పటివరకు ఖర్చు	రూ.796.92 కోట్లు
పొడవు ప్రారంభం (కిలో మీటర్లు)	31.071 కిలోమీటర్లు
భూసేకరణ హెక్టార్లు	1079.816(అవసరం) (సేకరించింది:703.116)
అటవీభూమి (హెక్టార్లు)	2.200(అవసరం) (సేకరించింది: 2.200)

ముఖ్యమైన బ్రిడ్జిలు	01
మేజర్ బ్రిడ్జిలు	21
చిన్న బ్రిడ్జిలు	153
సబ్ వేలు, ఆర్‌యూబీలు	37
స్టేషన్లు	14
భౌతిక పురోగతి	46 శాతం
ప్రాజెక్టు పూర్తి	2024–25

క్లుప్తంగా

ప్రజావాణికి అధిక ప్రాధాన్యం



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు లత, మకరంద్

జగిత్యాల: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యం ఇస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు లత, మకరంద్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ, సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రంతోపాటు వివిధ ప్రాంతాల నుంచి అనేక వ్యయ ప్రయాసాలకోర్చి అభాగ్యులు వస్తారని, అధికారులు తమ శాఖల వారీగా అర్జీలు స్వీకరించి సత్వరమే పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టవద్దని చెప్పారు. మొత్తం ప్రజావాణికి 34 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు మాధురి, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

22న జాబ్ మేళా

జగిత్యాల: జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈనెల 22న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి సత్తమ్మ తెలిపారు. ప్రముఖ కంపెనీ స్టార్‌హెల్త్, ఆలిండియా ఇన్సూరెన్స్ కంపెనీల్లో సేల్స్‌మేనేజర్లు 5, ట్రెయినీ సేల్స్ మేనేజర్లు 50 ఉద్యోగాలు ఉన్నాయని అన్నారు. వయస్సు 25 ఏళ్లు ఉండి, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. ఎంపికైన వారికి రూ.16వేల వేతనం ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు కలెక్టరేట్ సముదాయ భవనంలోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో 22న ఉదయం 11 గంటలకు హాజరు కావాలని తెలిపారు.

సర్పంచ్‌పై ఫిర్యాదు



ప్రజావాణికి వచ్చిన ముదిరాజ్‌లు

జగిత్యాల: పెగడపల్లి మండలం నామాపూర్ సర్పంచ్‌పై కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణిలో ఆ గ్రామ ముదిరాజ్‌లు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్‌లు మాట్లాడుతూ నామాపూర్ చెరువును మత్స్యశాఖ ద్వారా లీజుకు తీసుకుని 30 కుటుంబాలు జీవిస్తున్నాయన్నారు. గత నెలలో సర్పంచ్ చేపలు పట్టించి రూ.15 లక్షల వరకు తీసుకున్నారని ఆరోపించారు. హైకోర్టులో కేసు వేస్తే అనుకూలంగా తీర్పు వచ్చిందని, అయినా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు.. ఈ కార్యక్రమంలో ముదిరాజ్‌లు బొచ్చ శ్రీనివాస్, పులి నర్సయ్య, దండు రవి, నీలి శ్రీనివాస్, గంగాధర్ పాల్గొన్నారు.

పంచలోహ విగ్రహాల వితరణ

సారంగాపూర్(జగిత్యాల): మండలంలోని పోతారం గ్రామంలోని శ్రీలక్ష్మీ అమ్మవారి ఆలయానికి గంగధర మండలం గర్షకుర్తికి చెందిన మిట్టపల్లి శ్రీనివాస్–సంధ్యారాణి దంపతులు సోమవారం రూ.45వేల విలువ చేసే పంచలోహ విగ్రహాలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ డిల్లీ రామారావు, ఎంపీటీసీ జోగినపల్లి సుధాకర్‌రావులు దాతలను అభినందించారు.

మరమ్మతుకొస్తే మూలకే..!

- పారిశుధ్య వాహనాలకు మరమ్మతులు కరువు
- తుప్పుపడుతున్న వైనం
- చెత్త తరలింపునకు తీవ్ర ఇబ్బందులు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

శానిటేషన్ విభాగంలో వాహనాలు:

ట్రాక్టర్లు	: 45
ఆటోలు	: 11
బ్లేడ్ ట్రాక్టర్	: 1
స్వీపింగ్ మిషన్	: 1
ఫాగింగ్ మిషన్స్	: 2
టిప్పర్	: 1



మూలనపడ్డ ఖరీదైన వాహనం

జగిత్యాల: రాజుల సొమ్ము రాళ్లపాలు అన్న చందంగా.. మున్సిపల్ సొమ్మే కదా ఏం పోతుందన్న అనే రీతిలో మున్సిపల్ అధికారులు వ్యవహరిస్తున్నారు. లక్షలాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారు. జిల్లా కేంద్రంలో పారిశుధ్య నిర్వహణ కోసం లక్షలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన వాహనాలు మరమ్మతులకు గురైతే కనీసం చేయించకుండా మూలనపడేశారు. దీంతో అవి పూర్తిస్థాయిలో శిథిలావస్థకు చేరుతున్నాయి. దీంతో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది.

మరమ్మతులు కరువు

గ్రేడ్–1 జగిత్యాల మున్సిపాలిటీలో ఇటీవల కొన్ని గ్రామాలు విలీనం కావడంతో 48 వార్డులుగా ఏర్పడింది. ప్రస్తుతం ఉన్న వాహనాలు మున్సిపాలిటి ఏర్పడినప్పటి నుంచి ఉన్నాయి. లక్షలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన వాహనాలకు చిన్నపాటి మరమ్మతులు వస్తే వాటిని మూలనపడేస్తున్నారు. దీంతో అవి శిథిలావస్థకు చేరి తుప్పుపడుతున్నాయి. రోడ్లు ఊడ్చేందుకు రూ.50లక్షలతో కొనుగోలు చేసిన స్వీపింగ్ మిషన్ మరమ్మతుకు గురికాగా దానిని వాటర్ ట్యాంక్ పరిధిలో ఓ మూలన పడేశారు. అలాగే రూ.15లక్షలతో కొనుగోలు చేసిన బ్లేడ్ ట్రాక్టర్‌ను అగ్నిమాపక కేంద్రంలో పడేశారు. ఇక ట్రాక్టర్లు అయితే వాటర్ ట్యాంక్ పరిధిలో ఓ మూలనపడేశారు. దీంతో చెత్త తరలింపునకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

పారిశుధ్యం ఎలా..

మున్సిపాలిటీలో జనాభాకు తగినట్లు శానిటేషన్ సిబ్బంది లేరు. అందుకు సరిపడా వాహనాలు లేకపోవడంతో చెత్త సేకరణలో నిర్లక్ష్యం కనబడుతోంది. వార్డుల్లో చెత్త సేకరణ ప్రతిరోజూ జరగడం లేదు. డ్రెయినేజీల్లోని సిల్టును వారంలో ఒక రోజు తీస్తున్నారు. దీంతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకపోతోంది.

మరమ్మతులు చేయిస్తున్నాం



ప్రస్తుతం ఉన్న వాహనాలతో ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. వాహనాల మరమ్మతులకు ప్రణాళిక రూపొందించాం. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. ఎస్టిమేషన్ వేసి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తెచ్చేలా చూస్తాం. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తనివ్వం. ప్రతిరోజు చెత్త సేకరణ జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం.

– బోనగిరి నరేశ్, మున్సిపల్ కమిషనర్

పేదరికాన్ని జయించి.. డ్యాన్సర్‌గా రాణించి..



అవార్డు అందుకుంటున్న రాజేశ్



డ్యాన్స్ నేర్చుకున్న విద్యార్థులతో రాజేశ్

- రాష్ట్ర, జాతీయ స్థాయిలో యువకుడి ప్రతిభ

జగిత్యాలరూరల్: ఆ యువకుడు నిరుపేద కుటుంబంలో పుట్టాడు.. చిన్నప్పట్నుంచే అనేక కష్టనష్టాలు ఎదుర్కొన్నాడు.. అంతే.. ఏదైనా సాధించాలనే తపన చిన్నప్పుడే బలపడింది.. దానికితోడు పట్టుదల తోడైంది. అంతే.. టీవీలు, సినిమాల్లో నృత్యాలు పరిశీలించడం, ప్రాక్టీస్ చేయడం నేర్చుకున్నాడు.. అంతేకాదు.. తాను కూడా డ్యాన్స్ మాష్టారుగా ఎదగాలని కలలు గన్నాడు. వాటిని సాకారం చేసుకునేందుకుక అనేక ఆటుపోట్లు ఎదుర్కొన్నాడు.. ఫలితంగా బెస్ట్ డ్యాన్స్ మాస్టారుగా ఎదిగారు. ప్రతిభగల విద్యార్థులను డ్యాన్సర్లుగా తీర్చిదిద్దుతున్నాడు. ఆ యువ డ్యాన్సరే జగిత్యాల మండలం హస్నాబాద్ గ్రామానికి చెందిన దూడ రాజేశ్..

బీఎస్సీ డీఈడీ పూర్తిచేసి.. డ్యాన్సర్‌గా..

- రాజేశ్‌కు డ్యాన్స్‌పై ప్రేమ ఉన్నా.. బీఎస్సీ డీఈడీ, ఉన్నత విద్యాభ్యాసం పూర్తి చేయడంపై దృష్టి సారించాడు. ఆ మేరకు ఆ చదువులు పూర్తిచేశాడు.
- ప్రస్తుతం ఓ ప్రైవేట్ పాఠశాలలో ఇంగ్లిష్ మాష్టారుగా విద్యాబోధన చేస్తున్నారు.
- దీనికితోడు, ఉదయం, సాయంత్రం, సెలవు దినాలు, పండుగరోజుల్లో పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు నృత్యాలు నేర్పిస్తున్నారు.
- వివాహ, ఇతర శుభకార్యాల్లో కూడా మహిళలకు నృత్యాలు నేర్పిస్తున్నాడు.
- ఇతడు చూపుతున్న ప్రతిభ రాష్ట్ర, జాతీయ స్థాయి గుర్తింపు సాధిస్తోంది.
- రాష్ట్రస్థాయిలో 10 సార్లు, జాతీయస్థాయిలో ఆరుసార్లు తాను నృత్యం నేర్పించిన విద్యార్థులు అవార్డులు పొందడం గమనార్హం.
- అంతేకాదు, తాను స్వయంగా పలు డ్యాన్స్ ప్రోగ్రాంలు ఇవ్వడమే కాకుండా టీవీ చానళ్లలో కూడా జానపద నత్యాలు ప్రదర్శిస్తున్నాడు.
- దీంతో రాజేశ్‌కు 2021లో జాతీయ తారా ఆర్ట్స్ అకాడమీ వారు న్యూఢిల్లీ తెలంగాణ భవన్‌లో నాట్యముఖ జాతీయ అవార్డు అందజేశారు.

అన్నిరకాల నృత్యాల్లో శిక్షణ..

ప్రస్తుతం పాఠశాల, కళాశాల విద్యార్థులకు క్లాసికల్, సెమీ క్లాసికల్, జానపద, హిప్‌హాప్, పాశ్చాత్య, సాల్సా, బెల్లీ, దాండియా వంటి రకాల నృత్యాల్లో తర్ఫీదు ఇస్తున్నారు. ఆయన శిష్యులు కూడా రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణిస్తున్నారు. ప్రస్తుతం బతుకమ్మ, దాండియా కార్యక్రమాలను పలు జిల్లాలో నేర్పిస్తున్నాడు. ఏటా గచ్చిబౌలిలో జరిగే యూత్ ఫెస్టివల్‌లో రాజేశ్ గ్రూపు పలు జానపద నత్యాలు చేసి అవార్డులు పొందుతోంది. దీంతోపాటు కళాశాలల్లో ఫేర్‌వెల్ పార్టీలు, ఫ్రెషర్స్ డే పార్టీలు నిర్వహించేందుకు అవసరమైన డ్యాన్స్‌లను విద్యార్థులకు నేర్పిస్తున్నారు. రాజేశ్ యూట్యూబ్‌లో కూడా రైటర్‌గా,డైరెక్టర్‌గాకొరియోగ్రాఫర్‌గానూ మెప్పిస్తున్నాడు.

సన్మానాలు, సత్కారాలు..

రాజేశ్ డ్యాన్స్‌కు మెచ్చిన పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు సన్మానాలు, సత్కారాలు చేశారు. రాష్ట్ర, జాతీయస్థాయిలో పలువురు రాజేశ్ ప్రతిభను గుర్తించి సన్మానాలు, సత్కరాలు చేశారు. పట్టుదల, ఆసక్తి ఉంటే సాధ్యం కానిది ఏదీలేదని రాజేశ్ చెబుతున్నాడు.

ఊపిరితో వస్తాడనుకుంటే.. శవమై వచ్చాడు

- 14 ఏళ్ల క్రితం సౌది అరేబియా దేశం వెళ్లిన కథలాపూర్ వాసి
- మృతిచెందిన 27 రోజులకు ఇంటికి చేరిన మృతదేహం



కుమ్మరి నర్సయ్య శవపేటిక వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు, బంధువులు



కుమ్మరి నర్సయ్య(ఫైల్)

కథలాపూర్(వేములవాడ): ఉన్న ఊరిలో ఉపాధి కరువు.. పొట్ట చేతబట్టుకుని పరాయి దేశం వెళ్లగా అక్కడ ఉపాధి అంతంతే. కంపెనీ పని వదిలి కల్లిబిల్లి అయి చేతిలో రూపాయిలేక ఇంటికి రాలేక సతమతమయ్యాడు వలసజీవి. 14 ఏళ్ల తర్వాత ఇంటికి వద్దామనుకొని కుటుంబసభ్యులకు సమాచారమిచ్చి విమానం టికెట్ బుక్ చేసుకున్నాక గుండెపోటు రావడంతో గల్ఫ్‌లోనే మృతిచెందాడు. గ్రామస్తులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. కథలాపూర్ మండల కేంద్రానికి చెందిన కుమ్మరి నర్సయ్య(55) సౌదీ అరేబియా దేశంలో గతనెల 23న గుండెపోటుతో మృతిచెందగా.. సోమవారం మృతదేహం ఇంటికి చేరింది. నర్సయ్య ఉపాధి నిమిత్తం 14 ఏళ్ల క్రితం సౌది అరేబియా దేశం వెళ్లారు. అక్కడ సరైన ఉపాధి లేకపోవడంతో కల్లిబిల్లి అయి వివిధ రకాల పనులు చేస్తుండేవారు. స్వగ్రామానికి చేరుకొని కుటుంబసభ్యులను చూడాలని ఇటీవల అక్కడి మిత్రులతో సంప్రదించగా ఆర్థికసాయం అందించారు. గతనెల 24న ఇండియాకు వచ్చేందుకు టికెట్ బుక్ చేయించుకున్నారు. అంతలోనే 23న నర్సయ్యకు గుండెపోటు రావడంతో అక్కడి మిత్రులు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్సపొందుతూ అదేరోజు రాత్రి మృతి చెందారు. 14 ఏళ్ల తర్వాత ఇంటికి వస్తున్నాడని మృతుడి భార్య, కుమారుడు ఆనందంతో ఎదురు చూడగా.. గల్ఫ్‌లోనే ఊపిరి వదిలి శవపేటికలో మృతదేహం రావడంతో బాధితకుటుంబసభ్యులు, బంధువులు కన్నీటిపర్యంతమయ్యారు. మృతుడికి భార్య బుజ్జి, కుమారుడు జానీ ఉన్నారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షలు ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఉపాధి వేటలో ఆగిన ఊపిరి

- కువైట్‌లో గుండెపోటుతో కొత్తదాంరాజుపల్లి వాసి మృతి



రోదిస్తున్న గణేశ్ కుటుంబసభ్యులను ఓదార్చుతున్న ఎంపీపీ



గణేశ్ (ఫైల్)

మల్లాపూర్(కోరుట్ల): ఉన్న ఊరిలో ఉపాధి కరువై కనిపెంచిన తల్లిదండ్రులు, కట్టుకున్న భార్య, కన్నపిల్లలను వదిలి ఎడారి దేశానికి వలస వెళ్లిన మరో వలస జీవి ఊపిరి ఆగిపోయింది. మల్లాపూర్ మండలంలోని కొత్తదాంరాజుపల్లికి చెందిన సుంకె పెద్దగంగారాం–గంగులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు గణేశ్(32) ఉన్నారు. పెద్ద కుమార్తెకు వివాహం కాగా మరో కుమార్తె అనారోగ్య కారణాలతో ఇంటి వద్దే ఉంటోంది. గణేష్‌కి భార్య రాజేశ్వరితో పాటు కుమారుడు రాజు, కుమార్తె రియశ్రీ ఉన్నారు. గణేశ్ ఉపాధి కోసం 2020లో కువైట్‌కు వెళ్లి తిరిగి వచ్చాడు. 3 నెలల క్రితం మళ్లీ కువైట్‌కు వెళ్లాడు. కంపెనీలో విధులు నిర్వహిస్తుండగా ఈనెల 16న గుండెపోటుతో మృతి చెందాడు. అక్కడి భారతీయుల ద్వారా విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. గణేశ్ మృతదేహాన్ని స్వదేశానికి తీసుకువచ్చేందుకు కృషి చేయాలని స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులకు కోరారు. స్పందించిన గల్ఫ్ జేఏసీ చైర్మన్ గుగ్గిల్ల రవి, బీజేపీ రాష్ట్ర నాయకులు నిషాంత్ కార్తికేయలు నిజామాబాద్ ఎంపీ అరవింద్ దృష్టి తీసుకెళ్లారు. విదేశాంగ శాఖ అధి కారులతో మాట్లాడిన ఎంపీ అరవింద్ గణేశ్ మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించేందుకు ఏర్పాటు చేసినట్లు బీజేపీ నాయకులు తెలిపారు. కాగా బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కల్వకుంట్ల సంజయ్‌కుమార్ బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం ప్రకటించారు. ఈమేరకు ఎంపీపీ కాటిపెల్లి సరో జన, సర్పంచ్ బద్దం సరిత, నాయకులు కాటిపెల్లి ఆదిరెడ్డి, బద్దం కమలాకర్‌రెడ్డి, బద్దం నర్సారెడ్డిలు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేల నగదు అందజేశారు. మృతుడిది నిరుపేద కుటుంబం కావడంతో ప్రభుత్వపరంగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య



వినయ్ (ఫైల్)

సారంగాపూర్(జగిత్యాల): మండలంలోని రేచపల్లికి చెందిన గట్ల వినయ్(20) సోమవారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రేచపల్లికి చెందిన రత్నాకర్–పద్మ దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. తల్లిదండ్రులు దర్జీ పని చేసుకుంటూ జీవిస్తుండగా.. కుమారుడు వినయ్ జగిత్యాలలో డిగ్రీ చదువుతున్నాడు. రత్నాకర్–పద్మ, వారి కుమార్తెతో కలిసి సోమవారం దుబ్బరాజన్న జాతరలో రథోత్సవం చూసేందుకు వెళ్లారు. సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో ఇంటికి చేరేసరికి ఇంట్లో వినయ్ ఉరేసుకుని వేలాడుతుండటాన్ని గుర్తించి వెంటనే కిందికి దించారు. సారంగాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. వినయ్ ఆత్మహత్యపై ఇంకా వివరాలు సేకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ముగిసిన గుట్ట రాజేశ్వరస్వామి జాతర ఉత్సవాలు



స్వామివారి ఊరేగింపు

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండలం తుంగూర్ గ్రామ శివారులోని గుట్టరాజేశ్వరస్వామి మహాశివరాత్రి జాతర ఉత్సవాలు సోమవారం ముగిసాయి. స్వామివారికి రథం అందుబాటులో లేకపోవడంతో, రథంకు ప్రత్యామ్నాయంగా భక్తులు పల్లకిలో కొండకిందికి తీసుకవచ్చి ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుడిసె శ్రీమతి, ఎంపీటీసీ ఆడెపు మల్లీశ్వరి, ఆలయ చైర్మన్ కొల్లూరి ప్రభాకర్, ఉప సర్పంచ్ పూదూరి రమేశ్, నాయకులు అర్షకోట రమేశ్‌బాబు, బంటి, గంగారెడ్డి, సుధాకర్, రాజన్న, సత్తన్న, రాయమల్లు, మల్లేశ్, సత్యం, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ రైతు మృతి



మోహన్ మృతదేహం

రాయికల్(జగిత్యాల): మండలంలోని రాజనగర్ గ్రామానికి చెందిన రైతు గుగ్లావత్ మోహన్(42) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మోహన్ తన 1.20 ఎకరాల భూమిలో వరి పంట సాగు చేస్తున్నాడు. మూడు రోజుల క్రితం పొలంలో మందు చల్లుతుండగా బీపీ పెరగడంతో క్రిందపడిపోయాడు. గమనించిన రైతులు జగిత్యాల ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు, కూతురు ఉన్నారు.

అక్రమ పట్టాలను రద్దు చేయాలి



జగిత్యాలరూరల్: మండలంలోని నర్సింగాపూర్‌లో సర్వేనం.251, 437 ప్రభుత్వ భూమిలోని అక్రమ పట్టాలను రద్దు చేసి నిరుపేద దళితులకు ఇవ్వాలని బీజేపీ మండల అధ్యక్షుడు నలువాల తిరుపతి సోమవారం కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. నర్సింగాపూర్ గ్రామ శివారులోని 100 ఎకరాల ప్రభుత్వ భూమిలో కొందరు అక్రమ పట్టాలు పొందారని, విచారణ చేపట్టి స్వాధీనం చేసుకోవాలన్నారు. ఆ భూమి లేని నిరుపేదలకు అందజేయాలని కోరారు.

ఆయకట్టుకు సాగునీరు అందిస్తాం



జగదేవుపేట, కొండాపూర్ రైతులతో మంత్రి కొప్పుల

వెల్గటూర్(ధర్మపురి): జంగల్‌నాలా ప్రాజెక్టు పరిధిలోని జగదేవుపేట, కొండాపూర్ ఆయకట్టుకు సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని పలువురు సర్పంచులు, రైతులు మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను మంత్రి క్యాంపు కార్యాలయంలో సోమవారం కలిసి విన్నవించారు. స్పందించిన మంత్రి.. ఈఎన్సీ వెంకటేశ్వర్‌రావుతో ఫోన్‌లో మాట్లాడారు. కాకతీయ కాలువ ద్వారా చెరువులను నీటితో నింపి ఈ యాసంగి పంటలకు నీరు విడుదల చేయాలని ఆదేశించారు. వెల్గటూర్ మండలం జగదేవుపేట, కొండాపూర్‌తోపాటు శాకాపూర్, రాజక్కపల్లి, వెల్గటూర్, వెంకటాపూర్, లొత్తునూర్ పరిధిలోని ఆయకట్టు సాగునీటికి ఢోకా ఉండదని తెలిపారు.

రాష్ట్రస్థాయిలో రాణించాలి

ధర్మపురి: క్రీడాకారులు నైపుణ్యాలు పెంచుకుని రాష్ట్రస్థాయిలోనూ రాణించాలని మంత్రి కొప్పుల ఈశ్వర్ సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నియోజకవర్గస్థాయి ఎమ్మెల్యే రోలింగ్ క్రికెట్ కప్ టోర్నమెంట్ నిర్వహించారు. 153 జట్లు హాజరయ్యాయి. సోమవారం బుగ్గారం – మద్దలపల్లె జట్ల మధ్య ఫైనల్ పోటీలు జరిగాయి. బుగ్గారం జట్టు విజేతగా నిలువగా ప్రథమ బహుమతిగా రూ.60వేల నగదు, రన్నర్‌గా నిలిచిన మద్దులపల్లె జట్టుకు రూ.30వేల నగదును మంత్రి అందజేసి మాట్లాడారు. క్రీడలు మానసిక ఉల్లాసంతోపాటు ఐకమత్యం పెంపొందిస్తాయని అన్నారు. డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, ఎంపీపీ, జెడ్పీటీసీలు చిట్టిబాబు, బత్తిని అరుణ, రాజేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, పెగడపెల్లి ప్యాక్స్ చైర్మన్ రమణారావు పాల్గొన్నారు.

స్టీరింగ్ ఫెయిలై ఆటో బోల్తా

- 16 మంది కూలీలకు గాయాలు
- 23 మందితో బోల్తాపడిన గూడ్స్ ఆటో
- సిరిసిల్ల ఆస్పత్రికి తరలింపు
- అందరూ చీర్లవంచ గ్రామస్తులే



ప్రమాదస్థలంలో కూలీలు



ఆసుపత్రిలో ఆర్తనాదాలతో క్షతగాత్రులు



కుడిచేయి విరిగిన పలుమర్ల లలిత



చికిత్స పొందుతున్న వేల్పుల ఓదవ్వ



పక్కటెముకలు ఫ్యాక్చర్ అయిన మల్లవ్వ

ఇల్లంతకుంట(మానకొండూర్)/తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఆటో స్టీరింగ్ ఫెయిల్ కావడం ఆటోబోల్తా పడిన సంఘటనలో 16 మంది కూలీలు గాయపడ్డారు. ఏడుగురు సురక్షితంగా బయటపడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తంగళ్లపల్లి మండలం చీర్లవంచకు చెందిన 22 మంది వ్యవసాయ కూలీలు ఇల్లంతకుంట మండలంలోని నర్సక్కపేటకు పత్తి తీసే పనులకు ఉదయం ట్రాలీ ఆటోలో బయలుదేరారు. ఇల్లంతకుంట మండలంలోని వల్లంపట్లకు చేరుకోగానే ఆటో స్టీరింగ్ ఫెయిల్ కావడంతో ఒక్కసారిగా రోడ్డు పక్కకు దూసుకుపోయి బోల్తాపడింది. ఎస్సై మహేందర్ సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సమయంలో ఆటో డ్రైవర్ గంట పర్శరాములుతోపాటు 22 మంది కూలీలు ప్రయాణిస్తున్నారు. ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు, 16 మందికి స్వల్పంగా గాయపడగా.. ఏడుగురు క్షేమంగా బయటపడ్డారు. ఆటో బోల్తా పడిన ఘటనలో చీర్లవంచకు చెందిన వేల్పుల ఓదవ్వ పరిస్థితి విషమంగా ఉండగా.. ఐసీయూలో చికిత్స పొందుతోంది. పలుమరి లలితకు కుడి చెయ్యి విరిగింది. బోయిని మల్లవ్వ పక్కటెముకలకు గాయాలయ్యాయి. నర్మెట అంజవ్వ, పుష్పవ్వ, జెరిపోతుల కనకవ్వ, దుర్గవ్వ, మానువాడ దేవవ్వ, రేణుక, ముస్కానిపేట లచ్చవ్వ, కదారి బీరయ్య, పలుమరి లావణ్య, మల్లవ్వ, పద్మ, బోయిని మల్లయ్య, గంగ దేవేంద్రలకు స్వల్ప గాయాలయ్యాయి.

క్షతగాత్రులకు పరామర్శలు

క్షతగాత్రులను సిరిసిల్ల ప్రాంతీయ ఆస్పత్రికి తరలించగా తంగళ్లపల్లి జెడ్పీటీసీ పూర్మాని మంజుల –లింగారెడ్డి దంపతులు పరామర్శించారు. తక్షణ సాయంగా కొంత నగదు, భోజనం ఏర్పాటు చేశారు. ఎంపీపీ పడిగెల మానస, చీర్లవంచ సర్పంచ్ జక్కుల రవీందర్, నాయకులు జక్కుల నాగరాజు, జాలగం ప్రవీణ్(టోని) పరామర్శించారు.